www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -181 శనివారం 17 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## జహీరాబాద్‌లో 'హ్యుందాయ్'

# ఆర్ అండ్ డీ కేంద్రం

కార్ల తయారీ ప్లాంట్ పెట్టండి -'హ్యుందాయ్' యాజమాన్యానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో ఆ సంస్థ గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం..

త్వరలోనే భూమిపూజకు సిద్ధం -త్వరగా అనుమతులు ఇవ్వాలని అధికారులకు సీఎం ఆదేశం



**హైదరాబాద్,అక్టోబర్ 16 (ప్రజావినికిడి):** రాజధాని హైదరాబాద్‌లో కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని.. హ్యుందాయ్ యాజమాన్యాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇక్కడ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలోని బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. తెలంగాణను కార్ల తయారీకి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వారికి తెలిపారు. మిగతాది 2లో...

## పిల్లల సోషల్ మీడియా భద్రత..




కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు

ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి

ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన

తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం

**న్యూ ఢిల్లీఅక్టోబర్ 16 ((ప్రజావినికిడి):** సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు మిగతాది 2లో...

## ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు..




1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ

1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య

కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించలేదని విమర్శ

పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి పంపులు ఆన్ చేయలేదని ఆరోపణ

# ఉద్రిక్తంగా తిరంగా యాత్ర

భారీ జాతీయ జెండా ఎగురవేత -పోలీసుల నిర్బంధంలో సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే, నేహాబోరా




**న్యూ ఢిల్లీ అక్టోబర్ 16 (ప్రజావినికిడి):** దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం నాడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'తిరంగా యాత్ర' పేరుతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు మిగతాది 2లో...

## తిరుమలలో వైభవంగా

# శ్రీవారి గరుడ సేవ

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోటెత్తిన లక్షలాది మంది భక్తులు

లక్ష్మీకాసుల మాలతో గరుత్మంతునిపై దర్శనమిచ్చిన మలయప్ప స్వామి

గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల పురవీధులు

భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేసిన టీటీడీ యంత్రాంగం



**తిరుమలఅక్టోబర్ 16(ప్రజావినికిడి):** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడ వాహన సేవ శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో ఐదో రోజైన ఈ పర్వదినాన, స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతునిపై మలయప్ప స్వామి వారుమిగతాది 2లో...

# రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

## : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ



**హైదరాబాద్అక్టోబర్ 16 (ప్రజావినికిడి):** :కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని మిగతాది 2లో...

# రైతులను త్యాగాలు కోరడమా?

## : ప్రభుత్వంపై కవిత విమర్శ




**హైదరాబాద్,అక్టోబర్ 16(ప్రజావినికిడి):** ఎల్ నినో ప్రభావం, రాష్ట్రంలో రాబోయే నీటి కొరతను ఎదుర్కోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని ఆమె ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మిగతాది 2లో...

# రాయలసీమలో రణరంగం

## పుంగనూరులో వైసీపీ, టీడీపీ కార్యకర్తల ఘర్షణ



**పుంగనూరుఅక్టోబర్ 16 (ప్రజావినికిడి):** అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. అటు రాయచోటిలో వాహనాలకు నిప్పంటించారు. వివరాల్లోకి వెళితే.. వైసీపీ లోక్‌సభా పక్ష నేత, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి పార్టీ అభ్యర్థులతో కలిసి నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మిగతాది 2లో...

# జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం

'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్

అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు

యువత సమస్యలు తెలుసుకునే వేదికగా ఉండాలని పిలుపు

2లో.




# సాయికృష్ణ కేసు సీబీఐకి బదిలీ




ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు

బాధితుడి తల్లికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం

రాష్ట్ర పోలీసుల విచారణపై అనుమానాలు వ్యక్తం చేసిన న్యాయస్థానం

పోలీసులే మృతదేహాన్ని మాయం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో తీర్పు

**అమరావతిఅక్టోబర్ 16(ప్రజావినికిడి):** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ టార్చర్ కేసులో ఏపీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి బదిలీ చేస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేగాక బాధితుడి తల్లికి నాలుగు వారాల్లోగామిగతాది 2లో...

# సాయికృష్ణ కేసు సీబీఐకి బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వివరాల్లోకి వెళితే.. కొన్ని నాన్-బెయిలబుల్ వారెంట్ల కేసులో 25 ఏళ్ల సాయికృష్ణను 2026 మే నెలలో మార్కాపురం సమీపంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే, అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోగా, ఆ తర్వాత అతని ఆచూకీ గల్లంతైంది. దీంతో సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, మే 6 నుంచి 8 మధ్య కస్టడీలో జరిగిన చిత్రహింసల వల్లే సాయికృష్ణ మరణించినట్లు నిర్ధారించింది. అక్రమ నిర్బంధం, సీసీటీవీ ఫుటేజ్ డిలీట్ చేయడం, మృతదేహాన్ని రహస్యంగా మాయం చేయడం వంటి ఆరోపణలతో అప్పటి సీఐతో సహా పలువురు పోలీసు సిబ్బందిని అరెస్ట్ చేసి, చార్జిషీట్ కూడా దాఖలు చేశారు.

అయితే, రాష్ట్ర పోలీసుల విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని, కేసును సీబీఐకి అప్పగించాలని సాయికృష్ణ తల్లితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, సమగ్ర దర్యాప్తు అవసరమని భావించి కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు కూడా ఈ కేసు విచారణను పర్యవేక్షిస్తూ, ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, సాక్ష్యాలు మాయం కావడంపై ప్రశ్నలు లేవనెత్తడం గమనార్హం.

# జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

**హైదరాబాద్ అక్టోబర్ 16(ప్రజావినికిడి):**

ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

## ఉద్రిక్తంగా తిరంగా యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన అరెస్ట్ అయిన కొద్ది నిమిషాలకే, ఈ నిరసనలో పాల్గొనేందుకు వెళుతున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాను, ఇతర వామపక్ష కార్యకర్తలను మండి హౌస్ వద్ద పోలీసులు నిర్బంధించారు. సీజేపీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అరెస్ట్‌కు నిరసనగా అభిజీత్ దీప్కే ఈ 'తిరంగా అసెంబ్లీ'కి పిలుపునిచ్చారు. కన్నాట్ ప్లేస్ వద్దకు చేరుకుని జాతీయ జెండాను ఎగరేయాలని ఆయన ప్రజలను కోరారు. అయితే, ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ అనుమతి లేదని, ఆ ప్రాంతంలో ఇప్పటికే నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని తెలుపుతూ ఢిల్లీ పోలీసులు శుక్రవారం ఉదయం దీప్కేకు రెండు నోటీసులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అరెస్టులపై సీజేపీ అధికార ప్రతినిధి మెహర్ పస్రీచా స్పందిస్తూ, "జాతీయ జెండాను ఎక్కడ ఎగరేయాలో నిర్ణయించుకునే హక్కు మాకుంది. దానిపై ఎవరూ ఆంక్షలు విధించకూడదు. కేవలం జెండాను ప్రదర్శించినందుకే మా ఇద్దరు సహచరులను జంతర్ మంతర్ వద్ద అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయినప్పటికీ మేము వెనక్కి తగ్గబోం" అని అన్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం సెంట్రల్ పార్క్ వద్ద నిషేధాజ్ఞలు ఉన్నాయని పోలీసులు జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. అంతేకాకుండా, గతంలో విమానాశ్రయం వద్ద అదుపులోకి తీసుకున్నప్పుడు, ఏడాది పాటు ఎలాంటి ప్రజా అశాంతికి కారణం కాబోమని దీప్కే, ఆయన సహచరులు కోర్టు ఎదుట హామీ పత్రం (బాండ్ డౌన్) ఇచ్చారని, ఆ విషయాన్ని కూడా పోలీసులు తమ నోటీసులో గుర్తుచేశారు.

# రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

(మొదటి పేజీ తరువాయి)

విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు.

హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## జహీరాబాద్‌లో 'హ్యుందాయ్' ఆర్ అండ్ డీ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలూ అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి హ్యుందాయ్ బృందానికి తెలిపిన సీఎం.. డిసెంబరులో నిర్వహించినున్న గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాల్సింగా ఆహ్వానించారు. 678 ఎకరాల్లో విడతలవారిగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఆ ప్రాజెక్టు పురోగతి గురించి హ్యుందాయ్ ప్రతినిధులు శుక్రవారం భేటీలో ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్... అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రం ద్వారా హ్యుందాయ్ వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.

# రైతులను త్యాగాలు కోరడమా?

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎల్ నినో ప్రభావంపై నిపుణులు ఏడాది ప్రారంభంలోనే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని అన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరవు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు సమర్పించాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం దారుణమని ఆమె విమర్శించారు. రాబోయే 10 నెలలు రాష్ట్రం తీవ్ర నీటి కొరతను ఎదుర్కోనుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు 30 నెలలు గడుస్తున్నా ఇంకా పాత ప్రభుత్వంపై నిందలు వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000 ఇచ్చే పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కరవు పరిస్థితుల దృష్ట్యా వారికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే సమయంలో, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. ఏవైనా ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు జరిగాయా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ, రాష్ట్రంలో మాత్రం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

# పిల్లల సోషల్ మీడియా భద్రత.

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది.

'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు.

కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది.

ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ-ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు.

తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు.

సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో పిల్లల ఖాతాలకు తప్పనిసరి ప్రైవసీ సెట్టింగ్‌లు, వయసుకు తగిన యాక్సెస్, హానికర కంటెంట్‌పై ఆంక్షలు విధించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

# ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు..

### 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

**హైదరాబాద్ అక్టోబర్ 16 (ప్రజావినికిడి):**

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

**1,000 టీఎంసీల నీరు వృథా చేశారంటూ..**

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

**ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు లేవు**

ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు.

మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

# తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకమైన లక్ష్మీకాసుల హారంతో అలంకృతులై తిరుమాడ వీధుల్లో విహరించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగితేలారు.

శుక్రవారం రాత్రి 6:30 గంటలకు వాహన సేవ ప్రారంభమైంది. గజరాజుల గంభీర నడకలు, మంగళవాయిద్యాలు, కళాకారుల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేదఘోషల నడుమ గరుడ వాహనంపై శ్రీవారు ముందుకు కదిలారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ "గోవిందా.. గోవిందా.." అంటూ చేసిన జయజయధ్వానాలతో సప్తగిరులు మార్మోగాయి. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు.



**వర్షంలోనూ అచంచల విశ్వాసం**

మధ్యాహ్నం నుంచి తిరుమలలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి గ్యాలరీల్లో వేచి ఉండి, గరుత్మంతునిపై ఉన్న తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్నారు. వర్షంలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, బాదంపాలు, అల్పాహారం వంటివి అందించి వారిని ఆదుకున్నారు. టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పక్షిరాజైన గరుడుడు భగవంతునికి నిత్య సేవకుడు, పరమ భక్తుడు. ఆయనపై స్వామివారు విహరించడం భక్తికి, శరణాగతికి ప్రతీక. గరుడ వాహనంపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోయి, జ్ఞాన వైరాగ్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించడం జన్మ ధన్యమైనట్లుగా భక్తులు భావిస్తారు.

ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల జీయర్ స్వాములు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాయలసీమలో రణరంగం

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ కార్యకర్తలు తమ కాన్వాయ్‌ను అడ్డుకుని, నామినేషన్ కేంద్రానికి వెళ్లకుండా నిరోధించే ప్రయత్నం చేశారని వైసీపీ ఆరోపించింది. కర్రలు, ఇనుప రాడ్లతో వాహనాలపై దాడి చేశారని, ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. ఈ ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయి.

ఈ దాడి తనపై జరిగిన హత్యాయత్నమని వైసీపీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ప్రక్రియను హింసతో అడ్డుకునేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, తమ అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించింది.

ఈ ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని డిమాండ్ చేసింది. బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, అభ్యర్థులకు భద్రత కల్పించి ప్రశాంతంగా నామినేషన్లు వేసేలా చూడాలని కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో నెలకొన్న రాజకీయ వైరం ఈ ఘర్షణతో మరోసారి బయటపడింది.

అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రెచ్చగొట్టేలా, బెదిరింపులకు పాల్పడేలా ఆయన వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ తాడిపత్రి పట్టణ అధ్యక్షుడు హాజీ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివరాల్లోకి వెళ్తే, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పెద్దారెడ్డి తన ప్రత్యర్థి జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ తరఫున మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఫయాజ్ బాషాను బరిలోకి దింపుతున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రత్యర్థి, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన అనుచరులు తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా బెదిరిస్తున్నారని కేతిరెడ్డి ఆరోపించారు. తనను తాడిపత్రి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని, కోర్టు అనుమతితో రావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. "నేను వచ్చినప్పటి నుంచి నా చిటికెన వేలు వెంట్రుక కూడా పీకలేకపోయారు. అధికారం శాశ్వతం కాదు, ఈ విషయం ప్రభాకర్ రెడ్డి అనుచరులు, ఆయనకు మద్దతిచ్చే అధికారులు గుర్తుంచుకోవాలి. నాతో పెట్టుకుంటే ప్రతీకారం తీర్చుకుంటా" అని ఆయన గట్టిగా హెచ్చరించారు.

### చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలన్న అన్నమయ్య జిల్లా ఎస్పీ

పుంగనూరులో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమైంది. వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి నామినేషన్ కేంద్రానికి రావడం ఘర్షణకు దారితీయడం తెలిసిందే. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి వైసీపీ శ్రేణులు వ్యవహరించాయని, ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ తెలిపారు. దీనిపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జరిగిన ఘటనను వివరించారు. "పుంగనూరు మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో ఈరోజు నామినేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో వైసీపీకి చెందిన ఎంపీ మిథున్ రెడ్డి, ఆయన అనుచరులు, అభ్యర్థులు సుమారు 100 మంది తమ నివాసం నుంచి ఆరు వాహనాల్లో నామినేషన్ కేంద్రానికి బయలుదేరారు.

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలోకి అభ్యర్థి, మరో ఇద్దరు మాత్రమే రావాలి. కానీ, దాన్ని ఉల్లంఘించి, వాహనాలతో అతివేగంగా అక్కడ ఉన్న స్టాపర్లను, గేటును ఢీకొట్టుకుని లోపలికి వచ్చారు.

దీన్ని అక్కడ ఉన్న టీడీపీ అభ్యర్థులు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వెంటనే మా పోలీస్ సిబ్బంది జోక్యం చేసుకుని ఇరు



వర్గాలను చెదరగొట్టారు. అదే సమయంలో, ఒక వాహనం నామినేషన్ కేంద్రంలోకి అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకువచ్చి అక్కడి జనం మీదకు వెళ్ళింది. ఈ ఘటనలో కొందరికి గాయాలయ్యాయి. వారిని వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాం. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు మా బలగాలన్నింటినీ అక్కడికి తరలించి, గుంపును చెదరగొట్టాం. ఎంపీ గారిని ఒక గదిలో ఉంచాం. బయట గుంపు మొత్తం చెదిరిపోయిన తర్వాత, ఎంపీని సురక్షిత ప్రాంతానికి పంపించాం.

ఈ సంఘటనలో ఎవరైతే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నించారో, వారిని కఠినంగా శిక్షిస్తామని మా పోలీసు శాఖ తరఫున తెలియజేస్తున్నాను. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం" అని ఎస్పీ స్పష్టం చేశారు.

మరోవైపు, ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి కూడా తీవ్రంగా స్పందించారు. వైసీపీ శ్రేణుల తీరును ఖండిస్తున్నామని అన్నారు. పుంగనూరులో రౌడీయిజం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

ఈ సంఘటనతో పుంగనూరులో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శనివారం 17 అక్టోబర్ 2026

# కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం 'క్రేజీ కళ్యాణం'

**సుదర్శన్ 35 ఎంఎంలో కేక్ కటింగ్.. హీరో నరేష్‌తో కలిసి పాల్గొన్న ఖాదర్ గోరి**



**హైదరాబాద్,(ప్రజావినికిడి):** హైదరాబాద్‌లో 'క్రేజీ కళ్యాణం' చిత్రం విడుదల సందర్భంగా సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో హీరో నరేష్‌తో పాటు ఆల్ ఇండియా కృష్ణా మహేష్ ప్రజా సేన జాతీయ అధ్యక్షుడు ఖాదర్ గోరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖాదర్ గోరి మాట్లాడుతూ 'క్రేజీ కళ్యాణం' కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమని అన్నారు. చిత్రంలో హీరో నరేష్ చక్కటి నటనను కనబరిచారని తెలిపారు. ముఖ్యంగా సెంటిమెంట్ సన్నివేశాల్లో నరేష్ నటన చాలా బాగుందని, ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉందని ఖాదర్ గోరి పేర్కొన్నారు. సినిమా మంచి విజయాన్ని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.




# నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సమావేశం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు,ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని,వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల అవసరాలను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని,ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతరం దృష్టి సారిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి,వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,మండల అధ్యక్షులు సుదర్శన్ గౌడ్,శేఖర్ రెడ్డి, కుమారస్వామి గౌడ్,రమేష్, రాయికల్ శ్రీనివాస్,పురుషోత్తం రెడ్డి,జాకారం శేఖర్,శ్రీధర్, ఆర్డీఓ సరిత,నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు,ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

# చిన జీయర్ స్వామీజీ చేతుల మీదుగా షాలిని చారిటబుల్ ఐ హాస్పిటల్ ప్రారంభం

**పేదలకు ఉచితంగా కంటి వైద్య సేవలు: డాక్టర్ శాలిని రెడ్డి**



**శంషాబాద్, (ప్రజావినికిడి):** శంషాబాద్ మధురానగర్‌లోని ఎన్‌హెచ్-7 హైవే సమీపంలో ఏర్పాటు చేసిన షాలిని చారిటబుల్ ఐ హాస్పిటల్‌ను శుక్రవారం శ్రీశ్రీశ్రీ చిన జీయర్ స్వామీజీ ప్రారంభించారు. మంగళ దీప ప్రజ్వలన అనంతరం ఆసుపత్రిని ప్రారంభించిన స్వామీజీ, పేదలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన షాలిని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శాలిని రెడ్డి మాట్లాడుతూ, కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు చారిటీ ద్వారా కంటి పరీక్షలు, చికిత్సలు, శస్త్రచికిత్సలను ఉచితంగా లేదా రాయితీపై అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రశాంత్ కుమార్,డాక్టర్ మాధురి,డాక్టర్ శ్రీలక్ష్మి,డాక్టర్ టీ. దివ్య,డాక్టర్ సుచరితా నాయక్,డాక్టర్ పద్మలత దుడి, డాక్టర్ కె. ప్రియాంక, మేనేజర్ స్వరూప్ రెడ్డి,విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



# హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ లో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో శ్రీ సరస్వతీ దేవి అలంకరణ - విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిఅవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ నాయకి స్కూల్ యాజమాన్యం శ్రీ నాయకి శ్రీనివాస్ రావు విద్యార్థినీ విద్యార్థులకు నోట్‌బుక్,పెన్, పెన్సిల్ సెట్, రబ్బరు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు,ఆలయ కమిటీ చైర్మన్ టి. రాజేశ్వర్,శివ, శంకర్ పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, విద్యార్థి విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దసరా రద్దీ దృష్ట్యా 7 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం: తెలంగాణ ఆర్టీసీ ఎండీ

**ఈ నెల 19వ తేదీ వరకు అదనపు బస్సులు**

**పండుగ అనంతరం రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు సిద్ధం చేసినట్లు వెల్లడి**

**ప్రత్యేక సర్వీసుల వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్లలో సంప్రదించాలని సూచన**

**(ప్రజావినికిడి): అక్టోబర్16,** దసరా పండుగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ పూట సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తోంది. దసరా రద్దీని దృష్టిలో ఉంచుకుని 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు. దసరా పర్వదినం సందర్భంగా రద్దీ కొనసాగుతున్న దృష్ట్యా రేపటి నుంచి 19వ తేదీ వరకు అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ ఎండీ అధికారులను ఆదేశించారు. అలాగే పండుగ అనంతరం సొంత ఊళ్ల నుంచి నగరానికి, ఇతర ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రయాణికులు తమ టికెట్లను సంస్థ అధికారిక వెబ్‌సైట్ tgsrtcbus.in ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ప్రత్యేక సర్వీసులకు సంబంధించిన ఇతర వివరాల కోసం 040-69440000, 040-23450033 నంబర్లలో కాల్ సెంటర్లను సంప్రదించాలని కోరారు.




# నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

**:ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శుక్రవారం ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు వినతులు పరిష్కరించాలని విన్నవించారు. ఈ మేరకు వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

# రంగారెడ్డి జిల్లా కోర్టు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కమిటీ ఏర్పాటు



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): అక్టోబర్16,** రంగారెడ్డి జిల్లా కోర్టులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) కమిటీని ఈ నెల 15న ఏర్పాటు చేశారు. శ్రీమతి టి.సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షులు అబ్బగాని వెంకటేశ్వర్లు, ప్రభాకర్ హాజరయ్యారు. న్యాయవాదుల ఐక్యతను బలోపేతం చేయడం,వారి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడం, హక్కుల పరిరక్షణకు పాటుపడటంపై సమావేశంలో చర్చించారు. అనంతరం 22 మందితో జిల్లా కోర్టు కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షురాలిగా టి.సంధ్య,ప్రధాన కార్యదర్శిగా కె. రామచందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చౌడా కుమారి, బాపు భీమ్‌రావు, కొమరయ్య, సంయుక్త కార్యదర్శులుగా బి.శ్రీదేవి,ఎ. రాజిత, కందుకూరి నరసింహ చారి, కోశాధికారిగా ప్రవీణ్ ఎంపికయ్యారు.

# నిజాంపేట్ కనకదుర్గ ఆలయంలో కనుల విందుగా దసరా వేడుకలు

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** నిజాంపేట సర్కిల్ నిజాంపేట్ గ్రామంలో వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రులు ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యం పంతులు వేద ప్రవచనాల మధ్య ఘనంగా దేవీ నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారుశుక్రవారం మూలా నక్షత్రం రోజున అమ్మవారిని రాజమాతంగి అవతారంలో దర్శనం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని చండీ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం వారికి అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేసి వారిని ఆశీర్వదించారు. మూలా నక్షత్రం శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని తమ పిల్లలకు విద్యాభ్యాసం, కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కనకదుర్గమ్మ అమ్మవారు మూలా నక్షత్రం రోజున రాజమాతంగి అవతారంలో భక్తులకు అమ్మవారు



దర్శనమిస్తారని అమ్మవారిని దర్శించుకుంటే తమ పిల్లలకు మంచి విద్య ఉద్యోగాలతో ఉన్నత స్థాయికి వెళ్తారన్నారు. అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ, దేవీ నవరాత్రులలో ముఖ్యమైనది మూలా నక్షత్రం అని ఆ నక్షత్రం శుక్రవారం రావడంతో అమ్మవారు రాజమాతంగి అవతారంలో దర్శనమిస్తుండడంతో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. మూలా నక్షత్రం రోజున బాల, బాలిక చిన్న పిల్లలకు విద్యాభ్యాసం చేపిస్తే వారికి మంచి విద్య, ఉద్యోగం రాజకీయంగా ఉన్నత స్థాయికి వెళ్తారని తెలపారు.

ఈరోజు ఆలయంలో బాల బాలికలకు చిన్న పిల్లలకు విద్యాభ్యాసం అర్చకులచే చేయించామని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ పిల్లలకు విద్యాభ్యాసం చేయించుకున్నారని తెలిపారు. ఆలయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో అన్ని వసతులను సమకూర్చారన్నారు. శుక్రవారం రోజు జరిగిన అన్న వితరణ మహోత్సవ కార్యక్రమానికి రాధాకృష్ణమూర్తి, లక్ష్మి దంపతుల సహకరించారన్నారు. ప్రతిరోజు ఆలయ ఆవరణలో అన్న వితరణ కార్యక్రమం చేపడుతున్నామని ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న వితరణ కార్యక్రమానికి సహకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరన్నారు. సాయంత్రం సమయంలో అమ్మవారి ఉత్సవాల లో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన లక్ష్మి దేవి ఉత్సవ ఊరేగింపుకు, శుక్రవారం రోజు సరస్వతి అమ్మవారి ఉత్సవాలకు శ్రీనివాసరాజు సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రతి కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు.

# షాద్‌నగర్‌లో ఘనంగా 'వెల్వెట్'వాష్ లాండ్రీ & డ్రై క్లీనింగ్ షాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** పట్టణ ప్రజలకు ఆధునిక సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'వెల్వెట్' వాష్ లాండ్రీ & డ్రై క్లీనింగ్ షాప్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే,వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు అవసరమైన ఆధునిక సేవలు పట్టణంలో అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. నేటి జీవనశైలిలో లాండ్రీ,డ్రై క్లీనింగ్ సేవలకు మంచి ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి నమ్మకాన్ని పొందాలని నిర్వాహకులకు సూచించారు. షాద్‌నగర్ పట్టణం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వివిధ రంగాల్లో నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటు



కావడం స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. వ్యాపార రంగంలోకి రావాలనుకునే యువతకు ఇలాంటి నూతన సంస్థలు ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. వ్యాపార వేత్తలు నాణ్యత,సేవా ప్రమాణాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. 'వెల్వెట్' వాష్ లాండ్రీ & డ్రై క్లీనింగ్ ద్వారా పట్టణ ప్రజలకు వస్త్రాల ఉతకడం,డ్రై క్లీనింగ్ తదితర సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా




నిర్వాహకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,కొత్తూరు మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శిఇబ్రహీం,సాదిక్,ముబారక్ అలీఖాన్, జయప్రకాష్,లైక్,వెంకటేష్, చటన్ పల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు లక్ష్మీదేవునిపల్లి జలాశయం ప్రాణం

**జూరాల నుంచి నీటిని తరలిస్తేనే షాద్‌నగర్ రైతులకు సాగునీరు -గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు షాద్‌నగర్ రైతులకు అన్యాయం చేశాయి**

**పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలి.. రైతులకు న్యాయం చేయాలి..నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**






**పాలమూరు,(ప్రజావినికిడి):అక్టోబర్16,** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి, లక్ష్మీదేవునిపల్లి జలాశయాన్ని నిర్మించాలని బీజేపీ నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.జూరాల నుంచి కృష్ణా జలాలను తరలించినప్పుడే షాద్‌నగర్ ప్రాంత రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని, లక్ష్మీదేవునిపల్లి జలాశయం ఈ ప్రాజెక్టుకు ప్రాణం వంటిదని పేర్కొన్నారు.జన సాధన సమితి ఆధ్వర్యంలో వీర బ్రహ్మాచారి అధ్యక్షతన పాలమూరులోని తెలంగాణ చౌరస్తా సమీపంలో శివం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పాలమూరు హక్కుల సాధన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.లక్ష్మీదేవునిపల్లి జలాశయ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని, గతంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని అన్నారు.పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు రైతులకు సాగునీటి విషయంలో అన్యాయం చేశాయని విమర్శించారు. నెట్టెంపాడు,కల్వకుర్తి,భీమా తదితర పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి,నిర్దేశిత ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేశారు.పాలమూరు అభివృద్ధికి పార్టీలకతీతంగా ఐక్య పోరాటం చేయాలికృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేలా చర్యలు తీసుకోవాలని, పాలమూరు ప్రాంతానికి కేటాయించిన నీటిని సమర్థంగా వినియోగించుకునేలా ప్రాజెక్టులను పూర్తి చేయాలని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. సాగునీటి సమస్య పరిష్కారంతో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు వలసలు తగ్గి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పాలమూరు హక్కుల సాధనకు రాజకీయ పార్టీలు,రైతు సంఘాలు,ప్రజా సంఘాలు, మేధావులు కలిసి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ ఎంపీ డీకే అరుణ,టి.ఆచారి,ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు పి. మురళీ మనోహర్,మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు,వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కట్టా సుధాకర్ రెడ్డి,అందె బాబయ్య, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రావు,రమేష్, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రావు,కొండయ్య,రతన్ పాండు,రంగారెడ్డి,పదకుల బాలరాజు తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్..

**సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు..**

**పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద క్యాండిల్ వెలిగించి కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ ఉద్యమకారులు..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి,వారి వివరాల నమోదు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ తీసుకురావడం గొప్ప విషయమని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ అమరవీరుల స్తూపం వద్ద క్యాండిల్ వెలిగించారు.ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 13 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ, ఉద్యమకారులు తమ హక్కుల సాధన కోసం మళ్లీ రోడ్డెక్కి పోరాటాలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరించకుండా, ఉద్యమకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులకు వర్తించే విధివిధానాలపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదని పేర్కొంటూ, త్వరలోనే ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.గత 15 ఏళ్లుగా వివిధ రాజకీయ నాయకులు పదవులు అనుభవిస్తున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు మాత్రం ఇప్పటికీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ పార్టీలకు అతీతంగా తెలంగాణ ఉద్యమకారులందరూ ఐక్యంగా ఉండి,తమ హక్కులు, సంక్షేమం కోసం కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం జాంగారి రవి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల వివరాలను నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను తీసుకురావడం అభినందనీయమన్నారు.ఉద్యమకారులను గుర్తించి వారి వివరాలను పొందుపరిచే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం మంచి పరిణామమని పేర్కొన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించడం అభినందనీయమని అన్నారు.ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్ రాంరెడ్డి, ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకులు టీజీ శ్రీనివాస్,ఉద్యమ కారుల సంఘం తాలూకా కో కన్వీనర్ జాంగారి రవి,తెలంగాణ ఉద్యమ కారుల మండల అధ్యక్షులు దొడ్డి రవీందర్, పద్మరం వెంకటేష్ యాదవ్,షాద్ నగర్ తెలంగాణ ఉద్యమ కారుల సంఘం నేతలు మనోహర్,జాంగారి నర్సింహులు,రవి కుమార్ గౌడ్, బీరప్ప,చంద్ర శేఖర్ గౌడ్,మేకల వెంకటేష్,ఎల్లోజి,సింగ పాగ శివ కుమార్,సునీల్ రెడ్డి,కొమ్మగంటి శ్రీహరీ గౌడ్,బూర్గుల మహేందర్, కుడుముల మల్లేష్,అల్లద శేఖర్,బైండ్ల అంజయ్య,శివ కుమార్,ఆకాష్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 వేల అప్పు కోసం యువకుడి దారుణ హత్య

**ఇద్దరు నిందితులు అరెస్ట్**

**ఫ్యూచర్ సిటీ పోలీసుల దర్యాప్తుతో చిక్కిన నిందితులు రూ.20 వేల అప్పే కారణం**

**మీడియా సమావేశంలో షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ వెల్లడి**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కొత్తూరు తిగాపూర్ గ్రామ శివారులో డ్రీమ్ మిడాస్ వెంచర్‌లో లో జరిగిన హత్య కేసును ఛేదించిన కొత్తూరు పోలీసులు, మీడియా సమావేశంలో వెల్లడించిన షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ కేవలం రూ.20 వేల అప్పు తిరిగి చెల్లించే విషయంలో తలెత్తిన వివాదం ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది.అప్పు డబ్బుల విషయంలో జరిగిన వాగ్వాదం హత్యకు దారితీసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన సుమోటో హత్య కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బోడెక్ ప్రేమ్ కుమార్ (18) ఈ నెల14వ తేదీన తిగాపూర్ గ్రామ శివారులోని డ్రీమ్ మిడాస్ వెంచర్‌లో హత్యకు గురయ్యాడు.వెంచర్‌లో యువకుడు హత్యకు గురైనట్లు సమాచారం అందడంతో కొత్తూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతుడి గొంతుపై,ఛాతి, వీపు తదితర శరీర భాగాలపై పదునైన ఆయుధంతో దాడి చేసిన గాయాలను గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా,పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా మహమ్మద్ ఇర్ఫాన్ (20),మహమ్మద్ సవాజుద్దీన్ (23) అనే ఇద్దరు నిందితుల పాత్ర వెలుగులోకి వచ్చింది.ఇర్ఫాన్ హైదరాబాద్‌లోని బహదూర్‌పురా ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కాగా, సవాజుద్దీన్ రంగారెడ్డి జిల్లా మైలార్దేవ్‌పల్లి పరిధిలోని ఉద్దండపల్లికి చెందిన ఆటో డ్రైవర్‌గా పోలీసులు గుర్తించారు.ఈ నెల 14వ తేదీ ఉదయం ఇర్ఫాన్ మృతుడు ప్రేమ్ కుమార్‌కు ఫోన్ చేసి గతంలో ఇచ్చిన రూ.20 వేల అప్పు తిరిగి చెల్లించాలని కోరినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.తక్షణమే డబ్బులు చెల్లించలేనని మృతుడు చెప్పడంతో,కలిసి బీరు తాగుదామని ఇర్ఫాన్ అతడిని డ్రీమ్ మిడాస్ వెంచర్ వద్దకు పిలిచాడు.అనంతరం సవాజుద్దీన్‌కు ఫోన్ చేసి బీరు సీసాలు తీసుకురావాలని కోరాడు.దీంతో ఇర్ఫాన్ మృతుడితో కలిసి వెంచర్‌కు వెళ్లగా,సవాజుద్దీన్ అక్కడికి బీరు సీసాలతో చేరుకున్నాడు.ముగ్గురూ కలిసి బీరు తాగుతున్న సమయంలో అప్పు డబ్బుల విషయమై ఇర్ఫాన్,ప్రేమ్ కుమార్ మధ్య వాగ్వాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.ఈ క్రమంలో ఇర్ఫాన్ తన వద్ద ఉన్న కత్తితో ప్రేమ్ కుమార్ ఛాతి,వీపు తదితర భాగాలపై పలుమార్లు పొడిచినట్లు దర్యాప్తులో తేలింది.ఇర్ఫాన్ దాడి చేస్తున్న సమయంలో సవాజుద్దీన్ మృతుడిని గట్టిగా పట్టుకుని సహకరించినట్లు పోలీసులు గుర్తించారు.

అప్పు డబ్బుల విషయంలో తలెత్తిన వివాదమే ఈ హత్యకు ప్రధాన కారణంగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు.

హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు సంఘటనా స్థలానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు రహస్య సమాచారాన్ని సేకరించారు.మృతుడిని నిందితులు ఫోన్ చేసి పిలిచిన కాల్ వివరాలను విశ్లేషించి,ఇతర ఆధారాలను సేకరించడంతో నిందితుల పాత్ర బయటపడింది.ఈ క్రమంలో అక్టోబర్ 15వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు తిమ్మాపూర్ ఎక్స్ రోడ్,కొత్తూరు వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ,వైద్య పరీక్షల అనంతరం అక్టోబర్ 16వ తేదీన వారిని న్యాయస్థానంలో హాజరుపరిచారు.ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి,ఐపీఎస్ పర్యవేక్షణలో, షాద్‌నగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సీహెచ్.శిరీష రాఘవేంద్ర, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో,షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. కొత్తూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.నాగార్జున రెడ్డి,ఎస్సై ఎం.గోపాలకృష్ణతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించారు.కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు,సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# మల్‌బార్ గోల్డ్&డైమండ్స్ బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన

## 16 నుండి 25 వరకు తగ్గింపు ధరలు




**హైదరాబాద్, బ్యూరో, (ప్రజావినికిడి):** మలబార్ గోల్డ్&డైమండ్స్ హిమాయత్నగర్ షోరూంలో ప్రవేశ పడుతుంది. "అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన"ఈ ప్రదర్శనలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శిస్తుంది.ఈ ఆభరణాలు అద్వితీయమైన కళానైపుణ్యతతో,అంతులేని హుందాతనంతో కూడినవి.నగిషీ చెక్కిన ప్రతీ ఆభరణం తయారు చేసిన వారి అనుభవం ఇంకా కళాత్మకతకి నిదర్శనంగా నిలుస్తోంది. మలబార్ గోల్డ్&ఈ అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శనని ముఖ్య అతిధులు డైమండ్స్ టీం మెంబెర్స్,ఉన్నత అధికారులు శ్రేయోభిలాషుల సమక్షంలో ప్రారంభించారు. అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్&డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం "మైన్" ధ్రువీకరించబడిన వజ్రాభరణాలు, వివాహ,పార్టీ సంబరాల కోసం "ఎరా" అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి "ప్రెష్యా" జాతిరత్నాభరణాల సముదాయం "ఎత్నిక్స్" హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు, "డివైన్" భారతీయ ప్రాచీన సంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు ఇంకా చిన్నారుల కోసం "స్టార్లెట్" పిల్లల ఆభరణాలు సమకూర్చారు. ఈ ప్రదర్శన హిమాయత్నగర్ లో 16 అక్టోబర్ నుండి 25 అక్టోబర్ వరకు నిర్వహించబడుతుంది.ఈ ప్రదర్శనలో భాగంగా ప్రతి కొనుగోలు పై ప్రత్యేక ఆఫర్ పొందండి. రత్నాభరణాలు, అన్ కట్ ఆభరణాల తరుగు చార్జీలపై, డైమండ్ విలువపై 30శాతం వరకు తగ్గింపు ఉంటుందని మలబార్ స్టార్ హెడ్ శామీర్ రెహమాన్ ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో తెలిపారు.

# "ఆదర్శ కిరణం" దసరా,దీపావళి సంచిక మార్కెట్లోకి విడుదల చేసిన మహేష్ కుమార్ గౌడ్



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** ఆదర్శ కిరణం బడుగు బలహీన వర్గాల మాసపత్రికను దసరా,దీపావళి పండుగల సందర్భంగా ప్రత్యేక సంచికను నేడు నందిగామ గౌడ హాస్టల్ నూతన భవన ప్రారంభోత్సవానికి విచ్చేసిన టిపిఎస్సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా మాసపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "ఆదర్శ కిరణం"మాస పత్రిక పేద, బడుగు బలహీన వర్గాలకే కాకుండా గౌడ కులస్థులకు ఎంతో ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. అంతే కాకుండా మ్యారేజ్ బ్యూరోలో కూడా ఎంతో ఘన విజయం సాధించిందని ప్రశంసించారు. "ఆదర్శ కిరణం" మాస పత్రిక సంపాదకులు వంగాల బాలరాజు గౌడ్ మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు వి.శ్రీనివాస్ గౌడ్, గౌడ హాస్టల్స్ అధ్యక్షులు చక్రవర్తి గౌడ్, ఉపాధ్యక్షులు పరకాల లక్ష్మణ్ గౌడ్,పగడాల లక్ష్మణ్ గౌడ్,గౌడ ప్రముఖులు మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. జంట నగరాలలో నందిగామ గౌడ హాస్టల్ ప్రారంభోత్సవానికి వేలాది గౌడ్ ప్రముఖులు పాల్గొని విజయవంతం చేశారు.ఈ హాస్టల్ తో పాటు జంట నగరాలలో గౌడ హాస్టల్లో సంఖ్య నాలుగు కు చేరింది.

# రాజీవ్ గాంధీ నగర్‌లో ఘనంగా దుర్గామాత పూజా కార్యక్రమాలు



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** నిజాంపేట్ సర్కిల్‌లోని రాజీవ్ గాంధీ నగర్‌లో నిర్వహించిన దుర్గామాత పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎర్రోళ్ల విష్ణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయిరామ్, శ్రీనివాస్ గౌడ్, సోమనాథ్, మైనారిటీ డివిజన్ అధ్యక్షులు షకీల్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దేవి శరన్నవరాత్రి పూజలో పాల్గొన్న రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** ముచ్చింతల లో ప్రముఖ వ్యాపారవేత్త పిడిశెట్టి ప్రభాకర్ వ్యవసాయ క్షేత్రంలో అమ్మ వారి శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజ లో పాల్గొన్న ఎంపీ రాజ్యసభ డిఆర్ లక్ష్మణ్ దంపతుల తో పాటు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి తదితరులు పాల్గొన్నారు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఏజెన్సీ మండలంలో బహుళ అంతస్తులు..

## వాజేడు ఏజెన్సీ లో 1/70 చట్టం అమలు లో ఉన్నప్పటికీ యదేచ్ఛగా గిరిజనేతరుల బహుళ అంతస్తులు..

### పట్టించుకోని అధికారులు.. -ఏండ్లు గడుస్తున్న పెనుగోలు ఆదివాసులకు దక్కని న్యాయం..

**వాజేడు,అక్టోబర్ 17,(ప్రజావినికిడి):** వాజేడు మండల కేంద్రంలో ఎఎన్ఎస్ ఆదివాసి నవనిర్మాణ సేనా సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ, వాజేడు మండలం లో 1/70 చట్టం మరియు పీసా చట్టం అమలులో ఉన్నప్పటికీ గిరిజనేతరులు మాత్రం ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తున్న అక్రమ కట్టడాలు అలాగే బహుళ అంతస్తులు కడుతున్న వలసలు పెరుగుతున్న ఆదివాసి సంఘాలు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా గ్రీవెన్స్ డే లో ఎన్ని సార్లు మెమొరాండాలు ఇచిన గిరిజనేతరులు బహుళ అంతస్తులు కడుతున్న పట్టించుకొని ఎంపిడిఓ, యంపిఓ,మాత్రం నిమ్మకు నిరేత్తనట్లుగా గిరిజనేతరులకు అమ్ముడుపోయి వారికి



నోటీసులు ఇవ్వకుండా చట్టం ఉల్లంఘన కింద కేసు నమోదు చేయకుండా చోద్యం చూస్తున్నారని మండి పడ్డారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బహుళ అంతస్తులకు పర్మిషన్ ఎవ్వరు ఇస్తున్నారో వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఆదివాసీలు అయినటువంటి పెనుగోలు నుండి కిందకు దింపిన ఆదివాసులకు అధికారులు దశాబ్దాలు గడుస్తున్న నేటికి ఇంటి పన్నులు ఇవ్వకుండా కరెంటు మీటర్లు ఇవ్వకుండా చీకటిలోనే మగ్గిపోతున్న అధికారులు మాత్రం వీరికి ఇంటి పన్నులు ఇవ్వకుండా ఏజెన్సీ ప్రాంతంలో అర్హతలేని గిరిజనేతరులకు మాత్రం ఇంటిపన్నులు ఇస్తూ బహుళ అంతస్తులకు పర్మిషన్ లు ఇస్తున్నారని మండిపడ్డరు. చట్టాన్ని ఉల్లంఘించినా అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజలకు గత ప్రభుత్వం సాగుభూములు కూడా ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని అన్నారు. వెంటనే ఆదివాసులకు ఇంటి పన్నులు, ఇంటి పట్టాలు, కరెంట్ మీటర్ల సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి పాయం. అజయ్, ఏఎన్ఎస్ నాయకులు బొగ్గుల. నారాయణ, పాయం,కమల, బొగ్గుల మల్లయ్య,అంజలి,శ్రీజన తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటుతోనే ఆదివాసీలకు న్యాయం

### జిపిస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర



**వాజేడు,అక్టోబర్ 17,(ప్రజావినికిడి):** భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తేనే ఆదివాసి చట్టాలు పటిష్టంగా అమలవుతాయని శుక్రవారం వాజేడు మండల కేంద్రంలో మీడియాతో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ, 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టం మరియు పిసా చట్టాలు పటిష్టంగా అమలు కావాలంటే భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి యువత డిగ్రీలు పీజీలు చదివి నిరుద్యోగులుగా మిగిలిపోయారని దాని దృష్టిలో పెట్టుకొని భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తే ఆదివాసి యువతకు ఎంతో మేలు చేసిన వారు అవుతారని ఆయన అన్నారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు కాకుండా అడ్డుపడేది రాజకీయ పార్టీలే అని ఆయన అన్నారు వాజేడు మండల కేంద్రంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు వలస గిరిజనేతరులు కబ్జాలో ఉందని ఆ ప్రభుత్వ భూములను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిరుపేద ఆదివాసీలకు భూ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 1/70 చట్టానికి విరుద్ధంగా వలస గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతాల్లోకి ఎలా వస్తారని ఆయన ప్రశ్నించారు ఆదివాసీ యువత న్యాయవిద్యతోనే ఆదివాసి చట్టాలు అమలు అవుతాయని ఆయన అన్నారు. భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయుటకై జిపిస్పీ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని ఆ రిలే నిరాహార దీక్షలకు ఆదివాసి యువత తమ మద్దతులు ప్రకటించాలని ఆయన కోరారు. న్యాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే ను ఈ సందర్భంగా కోరారు.

# సోలిపూర్ రెవిన్యూలో ఆలయం తొలగింపు వివాదం..

### వెంచర్ యజమానులకు ఆర్డిఒ ఆదేశాలు.. పవిత్ర వృక్షాల తొలగింపుపై విచారణలో ఆధారాలు..

### 30 రోజుల్లో మర్రి,మేడి మొక్కలు నాటాలని స్పష్టం..

### నేటికీ పది (10)నెలలు గడుస్తున్న ఆర్డిఒ ఆదేశాలు పట్టించుకోని వెంచర్ నిర్వాహకులు..




గుడిని పుల్చివేసి ప్లాట్లుగా చేసిన సప్త వర్ణ రియాల్టర్స్



గుడి తొలగించి చదును చేసిన దృశ్యం

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ సోలిపూర్ రెవిన్యూలో పురాతన ఆలయం తొలగింపు వివాదం అధికారుల విచారణతో మరోసారి తెరపైకి వచ్చింది. ఆలయ నిర్మాణం,పవిత్ర వృక్షాలను తొలగించారంటూ వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు.. వెంచర్ యజమానులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. 30 రోజుల్లోగా మర్రి,మేడి మొక్కలు నాటాలని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలం సోలిపూర్ గ్రామ శివారులో పాత కర్నూలు రోడ్డు సమీపంలోని సర్వే నంబర్లు 140,141,142, 143లో పురాతన శ్రీ వెంకటేశ్వర స్వామి,ఆలయంతోపాటు శివలింగం,మర్రి,మేడి చెట్లను వెంచర్ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించారని పలువురు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు షాద్‌నగర్ ట్రిబ్యునల్ కమ్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎన్. ఆర్. సరిత విచారణకు ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో ప్రస్తుతం ఆలయ నిర్మాణాలు కనిపించలేదని,అయితే గతంలో ఆలయం ఉన్నట్లు సూచించే ఆనవాళ్లు, శిథిలాలు గుర్తించినట్లు ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ నివేదికలో పేర్కొన్నారు. అక్కడ శివలింగం ఉండటంతోపాటు పవిత్ర వృక్షాలను



తొలగించినట్లు ఆధారాలు లభించాయని వివరించారు. గతంలో ఆలయానికి ఎలాంటి ఇబ్బంది కలిగించబోమని వెంచర్ నిర్వాహకులు స్థానికులకు హామీ ఇచ్చినట్లు కూడా విచారణలో వెల్లడైంది.

#### మొక్కలు నాటకుంటే చర్యలు

వెంచర్ యజమానులు రెండు మర్రి మొక్కలు,రెండు మేడి మొక్కలు లేదా సంబంధిత అధికారులు సూచించిన అంతకంటే ఎక్కువ సంఖ్యలో మొక్కలను 30 రోజుల్లోగా నాటాలని ఆర్డిఒ ఆదేశించారు. అటవీ శాఖ,పురపాలక అధికారుల సమన్వయంతో మొక్కలు నాటి, జియో ట్యాగ్ చేసిన ఫొటోలతో కూడిన నివేదికను తహసీల్దార్‌కు అందజేయాలని స్పష్టం చేశారు. ఆదేశాలను పాటించకపోతే రెవెన్యూ, పర్యావరణ,వాల్టా,దేవాదాయ తదితర చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

#### అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కిన వెంచర్ నిర్వాహకులు

సాక్షాత్తు రెవిన్యూ డివిజనల్ అధికారినీ ఎన్. ఆర్. సరిత ఆదేశాల మేరకు 30 రోజుల్లో మొక్కలు నాటాలని సూచించగా నేటికీ పది(10) నెలలు గడుస్తున్నా మొక్కలు నాటడం దేవుడెరుగు అక్కడ ఉన్న గుళ్లను ధ్వంసం చేసి నేడు మట్టితో చదును చేసిన వైనం,అధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయకుండా వెంచర్నిర్వహకులు నిమ్మకు నీరు ఎత్తనట్టు వ్యవహరిస్తున్నారని బక్కని నరసింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

#### ఇప్పటి వరకు ఆరుగురి ఫిర్యాదులు

టిడిపి మాజీ ఎమ్మెల్యే,పొలిట్ బ్యూరో



ఆనాటి గుడి ఉన్న ప్రాంతం

సభ్యులు బక్కని నరసింహులు,మాజీ సర్పంచ్ పులిమామిడి వీరాంజనేయులు, బీజేపీ నాయకుడు అందె బాబయ్య,టీడీపీ నాయకుడు ఎల్. కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్ రెడ్డి,చెట్ల వెంకటేష్ ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. సిరి సంపద వెంచర్స్ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేస్తూ 2025 డిసెంబర్ 19న ఆర్డీఓ ఉత్తర్వులు వెలువరించారు. ఆలయ తొలగింపు ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఆదేశాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

# ఆసియా క్రీడల స్వర్ణ విజేతకు శంషాబాద్‌లో ఘన స్వాగతం

### అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన తెలంగాణ షూటర్ కెనాన్ చెనాయ్







**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 16,** జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో షూటింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన భారత షూటర్ కెనాన్ చెనాయ్‌కు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. క్రీడా అధికారులు, షూటింగ్ కోచ్‌లు, యువ క్రీడాకారులు, అభిమానులు ఆయనకు ఆత్మీయంగా స్వాగతం పలికారు. గచ్చిబౌలిలోని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ షూటింగ్ రేంజ్‌లో శిక్షణ పొందుతున్న కెనాన్ చెనాయ్ అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన బెరాట కప్ పోటీల్లోనూ పాల్గొని పతకాలు సాధించిన ఆయన విజయాలు యువ షూటర్లకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు పేర్కొన్నారు. తెలంగాణ నుంచి మరింత మంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు మెరుగైన శిక్షణ, అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని క్రీడా అధికారులు తెలిపారు.

# వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ చేసిన భరత్ సింగ్ ఠాకూర్



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి): అక్టోబర్ 16,**బీజేపీ సీనియర్ నాయకుడు భరత్ సింగ్ ఠాకూర్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనస్థలిపురంలోని 'రెడీ టు సర్వ్ ఓల్డ్ ఏజ్ హోమ్'లోని వృద్ధులకు అవసరమైన బియ్యం, పప్పులు,ఇతర నిత్యావసర సరుకులను, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రంగారెడ్డి అర్బన్ ప్రధాన కార్యదర్శి బొల్గాం యశోపాల్ గౌడ్ హాజరయ్యారు. తరుణ్ ఠాకూర్, కిరణ్ కుమార్, సంప్రత్,వరుణ్ ఠాకూర్,రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొని వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఓల్డ్ ఏజ్ హోమ్ వ్యవస్థాపకుడు పెద్దిశంకర్ మాట్లాడుతూ, భరత్ సింగ్ ఠాకూర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధుల అవసరాలను గుర్తించి,వారికి ఉపయోగపడేలా నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ మానవతా సేవలో భాగస్వాములైన బొల్గాం యశోపాల్ గౌడ్, తరుణ్ ఠాకూర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పుట్టినరోజులను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంతో పాటు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచే స్ఫూర్తిని కలిగిస్తుందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టిపిఎస్ ) గా బూర్గుల జెడ్పీ హైస్కూల్

### : రూ. 10 కోట్ల భారీ నిధుల కేటాయింపు..

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, పాలకవర్గం



**షాద్ నగర్, (ప్రజావినికిడి):** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీస్) విద్యా విధానంలో భాగంగా బూర్గుల జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఈ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ. 10 కోట్ల భారీ నిధులను కేటాయించింది. విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ ఇంతటి భారీ నిధులు మంజూరు చేయడం పట్ల బూర్గుల గ్రామ సర్పంచ్ రాజుగోపాల్ రెడ్డి, డిప్యూటీ సర్పంచ్ శివనీల రాజేందర్,వార్డు సభ్యులు,విద్యా కమిటీ చైర్మన్ అలాగే గ్రామ ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బూర్గుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సంబరాలు జరుపుకున్నారు.

# శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన కట్టమైసమ్మ అమ్మవారు

### బుద్వేల్‌లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న:సురేష్ దంపతులు



**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 16,** బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సురేష్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీ మహాలక్ష్మీదేవి కృపాకటాక్షాలతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# దిల్‌సుఖ్‌నగర్ కనకదుర్గా అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**దిల్సుఖ్నగర్,(ప్రజావినికిడి):** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రాంచందర్, ఈఓ శ్రీమతి స్నేహలత ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికి, అమ్మవారి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట మహేష్ యాదవ్, మధుసాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

## పాలమాకుల సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్




**శంషాబాద్, (ప్రజావినికిడి):** అక్టోబర్16, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులపై రైతులు ముందస్తు అవగాహన కలిగి ఉండాలని పాలమాకుల గ్రామ సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్ సూచించారు. నీటి వనరులను సంరక్షించుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పంటల సాగు, నీటి వినియోగం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పులు వ్యవసాయంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షపాతం తగ్గడం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకోవడం వంటి పరిస్థితులు ఎదురైతే వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, వాతావరణ సమాచారం ఆధారంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయానికి నీరు ఎంతో కీలకమని, అందుబాటులో ఉన్న నీటిని వృథా చేయకుండా అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవడం, సాగునీటిని పొదుపుగా వినియోగించే పద్ధతులపై అవగాహన పెంచుకోవడం అవసరమన్నారువర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలో నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు జల వనరుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రైతులు, గ్రామస్థులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. భవిష్యత్తులో నీటి కొరత వంటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని కోటేశ్వర్ గౌడ్ సూచించారు.

# జోనల్ కమిషనర్ కు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పలు డివిజన్ ల సమస్యల పైన చర్చ



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
శుక్రవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండు రోజుల క్రితం నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లో పర్యటించన నేపథ్యంలో అట్టి పనుల నిమిత్తం మరోమారు సమావేశం కావడం జరిగింది. అయ్యప్ప కాలనీ నందు డ్రైనేజ్ పనులు యుద్ధప్రాతిపదికన ప్రారంభం చేయాలని, ఆటోనగర్ డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల చెత్తాచెదారం క్లీన్ చేసి, ఫుట్ పాత్ లు నిర్మించి, సీ.సీ.కెమెరాలు, లైట్లు ఏర్పాటు చేసి, రోడ్డు ఇరువైపులా చెట్లు నాటాలని కోరారు. అలాగే బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ నందు నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలని, హరిహర పురం కాలని, విజయపురి కాలనీ నందు నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం చంపాపేట్ డివిజన్ పరిధిలోని పవన్ పూరి కాలనీ నందు నూతన కమ్యూనిటీ హాల్ పనులను వెంటనే ప్రారంభం చేయాలని కోరారు. దానికి కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రతిపాదనలు పంపించడం జరిగిందని అతి త్వరలోనే పనులు ప్రారంభం చేయడం జరుగుతుంది సుధీర్ రెడ్డి కి తెలిపారు.

# బూర్గుల గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ -అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ





**షాద్ నగర్, (ప్రజావినికిడి):**
ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో శుక్రవారం రోజు రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. బూర్గుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో 31 ఇళ్లు, రెండో విడతలో 14 ఇళ్లు మంజూరు చేశామని, మొత్తం 45 ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించామని పేర్కొన్నారు. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ స్కూల్ మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా బూర్గుల గ్రామంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే బూర్గుల గ్రామ ప్రజల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అతి త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడటంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు పంట నష్టం జరగకుండా ఉండేందుకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రతిరోజూ అదనంగా మూడు గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. అదనపు విద్యుత్ సరఫరాతో రైతులకు సాగునీటి అవసరాలు తీరి, పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, విద్య, రవాణా, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల్‌రాజ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కొత్తూరు టౌన్ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, సర్పంచులు యాదగిరి, రాజగోపాల్ రెడ్డి, వడ్ల జంగయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగారి రవి, తాలూకా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్, నాయకులు ముబారక్ అలీ ఖాన్, కుమార్ నాయక్, వెంకటేష్, నర్సప్ప గూడ క్రిష్ణ, శ్రీనివాస్ రెడ్డి, బూర్గుల మాజీ సర్పంచ్ శివకుమార్, గ్రామ అధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో నకిలీ రిజిస్ట్రేషన్ల దందా.. ముగ్గురి అరెస్ట్

నకిలీ యూఎల్‌సీ పత్రాలతో అక్రమ భూ రిజిస్ట్రేషన్లు

మేడ్చల్ జిల్లాలో ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్

ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ. 6 లక్షలు వసూలు

నిందితుల నుంచి నకిలీ పత్రాలు, స్టాంప్ పేపర్లు స్వాధీనం

జీడిమెట్ల పరిధిలో వెలుగు చూసిన మోసం

**మేడ్చల్ (ప్రజావినికిడి):**
నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రీతిలో భూముల రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును మేడ్చల్ పోలీసులు రట్టు చేశారు. ఈ మోసానికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుంచి కీలకమైన నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల ప్రాంతంలో ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి వచ్చింది.



నిందితులు ప్రధానంగా నకిలీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) క్లియరెన్స్ పత్రాలను రూపొందించారు. వీటిని ఆధారంగా చేసుకుని జీడిమెట్ల ప్రాంతంలోని సర్వే నంబర్లు 192, 193లో గల భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఒక్కో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నిందితులు సుమారు రూ.6 లక్షల మేర వసూలు చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ఇప్పటివరకు రెండు అక్రమ రిజిస్ట్రేషన్లను వీరు పూర్తి చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ భారీ మోసంపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నకిలీ యూఎల్‌సీ పత్రాలతో పాటు స్టాంప్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలలో ఇటీవల భూ సంబంధిత అక్రమాలు పెరుగుతున్న తరుణంలో అధికారులు నిఘాను మరింత తీవ్రతరం చేశారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరి హస్తమైనా ఉందా? వీరు గతంలో మరిన్ని మోసాలకు పాల్పడ్డారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# ఐదేళ్లు పోరాడి కాపాడుకున్న పార్కు.. మళ్లీ నిర్లక్ష్యపు నీడలో..!

## డ్రైనేజీ లైన్‌తో దెబ్బతిన్న పార్కు.. పట్టించుకోని అధికారులు..

**ఎల్బీనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 16,**
తట్టి అన్నారం శ్రీ లక్ష్మీ గణపతి కాలనీలోని పార్కు స్థలాన్ని కాపాడుకునేందుకు ఐదేళ్లపాటు పోరాటం చేసిన కాలనీవాసులకు అధికారుల నిర్లక్ష్యం నిరాశ కలిగిస్తోంది. గతంలో పార్కు స్థలం కబ్జాకు గురికావడంతో కాలనీవాసులు హైడ్రా సహకారంతో తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పార్కును అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేసినా స్పందన లేకపోవడంతో, కాలనీవాసులే ఇంటికింత చందాలు వేసుకుని పార్కును అభివృద్ధి చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం కూడా నిర్వహించారు.

### పార్కు మధ్యలో డ్రైనేజీ లైన్

కొంతకాలం తర్వాత పార్కు స్థలం కబ్జాకు సహకరించినట్లు తాము ఆరోపిస్తున్న కొందరు వ్యక్తుల కారణంగా అధికారులు తప్పుదోవ పట్టి, పార్కు మధ్యలో నుంచి డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేశారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో తాము కష్టపడి అభివృద్ధి చేసుకున్న పార్కు దెబ్బతిన్నదని ఆవేదన



వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా, పార్కును తిరిగి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

### ఫిర్యాదులు చేసినా స్పందన కరువు

పార్కు సమస్యపై నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, సంబంధిత ఎంఎంసీ నాగోల్ డిప్యూటీ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు కాలనీవాసి నవీన్ రెడ్డి వరకాంతం తెలిపారు. అయినప్పటికీ అధికారులు స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఐదేళ్లపాటు పోరాడి కాపాడుకున్న పార్కును మళ్లీ అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు పార్కు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కాసుల వర్షం కురిపించే సిరీస్.. విండీస్ బోర్డు ఖాతాలో మాత్రం సున్నా!

### భారత్‌కు రూ.285 కోట్ల వరకు ఆదాయం.. వెస్టిండీస్‌కు మాత్రం నయాపైసా దక్కదా?

హైదరాబాద్: భారత్‌వెస్టిండీస్ క్రికెట్ సిరీస్ ద్వారా భారీ ఆదాయం సమకూరుతున్నప్పటికీ, పర్యాటక జట్టు వెస్టిండీస్ క్రికెట్ బోర్డుకు మాత్రం నేరుగా ఎలాంటి ఆదాయం రావడం లేదని ఆ బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి క్రిస్ డెహ్రింగ్ వెల్లడించారు. ప్రస్తుత ద్వైపాక్షిక క్రికెట్ ఆదాయ పంపిణీ విధానంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌లో జరుగుతున్న వన్డే, టీ20 సిరీస్‌ల ద్వారా సుమారు 20 నుంచి 30 మిలియన్ డాలర్ల ఆదాయం, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.190 కోట్ల నుంచి రూ.285 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉందని డెహ్రింగ్ పేర్కొన్నారు. అయితే, ఈ ఆదాయంలో వెస్టిండీస్ బోర్డుకు ప్రత్యక్ష వాటా ఉండదని తెలిపారు. **1997లో మారిన ఆదాయ విధానమే కారణం**అంతర్జాతీయ క్రికెట్ ఆదాయ నమూనాలో 1997లో తీసుకొచ్చిన మార్పులే చిన్న క్రికెట్ బోర్డుల ఆర్థిక సమస్యలకు ఒక కారణమని డెహ్రింగ్ అభిప్రాయపడ్డారు. అప్పట్లో విదేశీ పర్యటనలకు వెళ్లే జట్లకు ఆతిథ్య దేశాలు చెల్లించే మొత్తాల ద్వారా కూడా ఆదాయం వచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుత విధానంలో ద్వైపాక్షిక సిరీస్‌ల నిర్వహణ, ప్రసార హక్కులు, వాణిజ్య



ఒప్పందాల ద్వారా వచ్చే ఆదాయం ప్రధానంగా ఆతిథ్య దేశ క్రికెట్ బోర్డుకే దక్కుతుంది. **భారత్‌తో పోల్చలేం..**భారత్‌లో క్రికెట్‌కు భారీ ఆదరణ, విస్తృత ప్రేక్షకవర్గం ఉండటంతో ప్రసార హక్కులు, వాణిజ్య ఒప్పందాల ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుందని డెహ్రింగ్ పేర్కొన్నారు. అదే వెస్టిండీస్‌లో సిరీస్‌లు నిర్వహించినప్పుడు అంతటి ఆదాయం సమకూరడం కష్టమని వివరించారు. భారత్‌ను తప్పుబట్టడం తన ఉద్దేశం కాదని, చిన్న క్రికెట్ బోర్డులకు ప్రయోజనం కలిగేలా ఆదాయ పంపిణీ విధానాన్ని పునఃపరిశీలించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# తండ్రికి తగ్గ తనయుడు.. 173 పరుగులతో దంచికొట్టిన సెహ్వాగ్ కుమారుడు!



### 143 బంతుల్లో 19 ఫోర్లు, 8 సిక్సర్లు.. ద్విశతకానికి 27 పరుగుల దూరంలో నిలిచిన ఆర్యవీర్

భారత మాజీ విధ్వంసకర ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుత బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్నాడు. వినూ మన్కడ్ ట్రోఫీ అండర్-19 వన్డే టోర్నీలో ఢిల్లీ జట్టు తరపున ఆడుతున్న ఆర్యవీర్.. చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో పరుగుల వరద పారించాడు. ఢిల్లీ జట్టుకు నాయకత్వం వహిస్తున్న అతడు 143 బంతుల్లో 173 పరుగులు సాధించి తన బ్యాటింగ్ సత్తాను చాటాడు. **ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడిన ఆర్యవీర్** ఆర్యవీర్ తన ఇన్నింగ్స్‌లో 19 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. మరో ఓపెనర్ ఆర్నవ్ బగ్గాతో కలిసి తొలి వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆర్నవ్ 47 పరుగులు చేసి జట్టు స్కోరుకు తోడ్పడ్డాడు. ఆర్యవీర్ దూకుడైన ఆటతో ఢిల్లీ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 289 పరుగులు సాధించింది. అయితే, ద్విశతకం దిశగా సాగుతున్న అతడి ఇన్నింగ్స్ 46వ ఓవర్‌లో ముగిసింది. **భారీ ఇన్నింగ్స్ ఆడినా తప్పని ఓటమి!**ఆర్యవీర్ అద్భుతంగా ఆడినప్పటికీ ఢిల్లీ జట్టుకు విజయం దక్కలేదు. 290 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చండీగఢ్ జట్టు రూపేశ్ యాదవ్ (167), మీత్ దహియా (63) రాణించడంతో 41.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో చండీగఢ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇటీవల భారత అండర్-19 జట్టు తరపున అరంగేట్రం చేసిన ఆర్యవీర్.. ఈ భారీ ఇన్నింగ్స్‌తో మరోసారి వార్తల్లో నిలిచాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ తరహాలో దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటూ భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నాడు.



# ఐదో టీ20కి ముందు టీమిండియాకు షాక్.. అర్ష్‌దీప్‌కు గాయం, భువనేశ్వర్ ఎంట్రీ!

### • నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ టీ20 జట్టులోకి భువనేశ్వర్ కుమార్.. భారత్‌వెస్టిండీస్ సిరీస్ నిర్ణయాత్మక పోరుపై ఆసక్తి

**బెంగళూరు:** వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు ముందు భారత జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ భుజానికి గాయం కావడంతో అతడి స్థానంలో అనుభవజ్ఞుడైన బౌలర్ భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అక్టోబర్ 16న ప్రకటించింది. **నాలుగేళ్ల తర్వాత జాతీయ జట్టులోకి..**భువనేశ్వర్ కుమార్ చివరిసారిగా 2022 నవంబర్‌లో భారత్ తరపున అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడాడు. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత జాతీయ జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం అతడికి లభించింది. స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల భువనేశ్వర్ రాకతో భారత బౌలింగ్ విభాగానికి అనుభవం తోడుకానుంది. **సిరీస్ విజేత ఎవరో తేలేది రేపే!**భారత్, వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రస్తుతం 22తో సమంగా ఉంది. చివరి మ్యాచ్ అక్టోబర్ 17న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది.అర్ష్‌దీప్ సింగ్ చివరి మ్యాచ్‌లో ఆడే విషయంపై అతడి కోలుకునే పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని బీసీసీఐ వెల్లడించింది. మరోవైపు, భువనేశ్వర్ కుమార్ తుది జట్టులో చోటు దక్కించుకుంటాడా అనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. స్వింగ్ కింగ్ భువనేశ్వర్ తన పునరాగమనాన్ని విజయంతో ప్రారంభిస్తాడా? సిరీస్ నిర్ణయాత్మక పోరులో టీమిండియా ప్రదర్శన ఎలా ఉంటుందో చూడాలి.



# ఇక మంధాన శకం.. జింబాబ్వేతో నేడు భారత్ తొలి టీ20!

### - పూర్తిస్థాయి కెప్టెన్‌గా స్మృతి మంధానకు తొలి సవాల్.. విజయంతో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని భారత మహిళల జట్టు లక్ష్యం

**రాయ్‌పూర్:** భారత మహిళల క్రికెట్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన పూర్తిస్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ తన తొలి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో జింబాబ్వేతో తలపడనుంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలి పోరు శుక్రవారం రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరగనుంది. మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. **జట్టులో కొత్త ఉత్సాహం** మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో స్మృతి మంధానకు పగ్గాలు అప్పగించారు. ఇప్పటికే గతంలో తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపించిన అనుభవం ఆమెకు



ఉంది. ఇప్పుడు పూర్తిస్థాయి నాయకురాలిగా జట్టును విజయపథంలో నడిపించడంపై దృష్టి సారించింది. జట్టులో వృత్తిపరమైన క్రమశిక్షణ, ఫీల్డింగ్, దూకుడైన బ్యాటింగ్ ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని మంధాన భావిస్తోంది. **చరిత్ర సృష్టించనున్న భారత్, జింబాబ్వే**భారత మహిళల జట్టు, జింబాబ్వే మహిళల జట్టు తొలిసారిగా ద్వైపాక్షిక అంతర్జాతీయ సిరీస్‌లో తలపడుతున్నాయి. ఈ సిరీస్ ద్వారా యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించనుంది. మరోవైపు, స్వదేశంలో ఆడుతున్న భారత్ బలమైన ప్రదర్శనతో సిరీస్‌ను ప్రారంభించాలని చూస్తోంది.టీ20 సిరీస్ షెడ్యూల్- తొలి టీ20: అక్టోబర్ 16 రాయ్‌పూర్- రెండో టీ20: అక్టోబర్ 18 రాయ్‌పూర్- మూడో టీ20: అక్టోబర్ 20 రాయ్‌పూర్మూడు మ్యాచ్‌లూ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్నాయి. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసార వీక్షణ అందుబాటులో ఉంటాయి.



# క్రికెట్‌లో సరికొత్త ఫార్మాట్.. ఒకే జట్టులో అమ్మాయిలు, అబ్బాయిలు!

### - టెస్ట్ ట్వంటీతో క్రికెట్‌లో కొత్త అధ్యాయం.. ఇద్దరి పరుగులూ కలిపితేనే విజయం। నవంబర్ 14 నుంచి కొలంబోలో తొలి టోర్నీ

**కొలంబో:** క్రికెట్ ప్రపంచంలో సరికొత్త ఫార్మాట్ అందుబాటులోకి రానుంది. పురుషులు, మహిళలు ఒకే జట్టులో భాగంగా ఉంటూ, వారి ప్రదర్శన ఆధారంగా విజేతను నిర్ణయించే వినూత్న విధానానికి శ్రీకారం చుట్టనున్నారు. 'టెస్ట్ ట్వంటీ' పేరుతో నిర్వహించనున్న ఈ టోర్నీ నవంబర్ 14 నుంచి 29 వరకు శ్రీలంక రాజధాని కొలంబోలో జరగనుంది. క్రికెట్‌లో నాలుగో ఫార్మాట్‌గా నిర్వాహకులు అభివర్ణిస్తున్న ఈ పోటీలకు సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానం వేదిక కానుంది. **ఒకే జట్టు.. రెండు విభాగాలు.. ఉమ్మడి స్కోరు!** ఈ టోర్నీలో ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన 13 నుంచి 21 ఏళ్ల వయసున్న 160 మంది యువ క్రికెటర్లు పాల్గొంటారు. వీరిని నాలుగు జట్లుగా విభజిస్తారు. ఒక్కో జట్టులో 20 మంది అమ్మాయిలు, 20 మంది అబ్బాయిలు ఉంటారు. అమ్మాయిల జట్టు ప్రత్యర్థి అమ్మాయిల జట్టుతో, అబ్బాయిల జట్టు ప్రత్యర్థి అబ్బాయిల జట్టుతో పోటీపడుతుంది. అయితే, రెండు విభాగాల్లో చేసిన పరుగులను కలిపి జట్టు మొత్తం స్కోరుగా పరిగణిస్తారు. ఈ ఉమ్మడి స్కోరు ఆధారంగానే విజేతను నిర్ణయిస్తారు. **80 ఓవర్లు.. రెండు రకాల బంతులు!** టెస్ట్ ట్వంటీ మ్యాచ్ ఒక్క రోజులో 80 ఓవర్ల పాటు సాగుతుంది. తొలి 40 ఓవర్లు పగటి సమయంలో ఎర్ర బంతితో, తెల్ల దుస్తుల్లో ఆడతారు. మిగిలిన 40 ఓవర్లు ఫ్లడ్‌లైట్ల వెలుగులో తెల్ల బంతితో, రంగుల దుస్తుల్లో నిర్వహిస్తారు. తొలి సెషన్‌లో సాధించిన పరుగులు రెండో సెషన్‌లోనూ కొనసాగుతాయి. స్కోరును మళ్లీ సున్నా నుంచి ప్రారంభించే అవకాశం ఉండదు.

# ఐదో టీ20లో వైభవ్‌కు ఛాన్స్ ఇవ్వండి!

### - యువ సంచలనాన్ని చూడాలని ఆసక్తిగా ఉంది: అభిషేక్ నాయర్



**బెంగళూరు:** వెస్టిండీస్‌తో జరగనున్న నిర్ణయాత్మక ఐదో టీ20లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కుతుందా? ప్రస్తుతం క్రికెట్ అభిమానుల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ ఆడితే చూడాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ఆయన తెలిపారు. **ఓపెనర్‌గానే బరిలోకి దించాలి** వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పిస్తే అతడిని ఓపెనర్‌గా ఆడించాలని నాయర్ సూచించారు. బెంగళూరు వంటి బ్యాటింగ్‌కు అనుకూలమైన మైదానంలో వైభవ్ తన సత్తా చాటగలడని అభిప్రాయపడ్డారు. అయితే, అతడి కోసం బ్యాటింగ్ క్రమాన్ని మార్చడం సరైన నిర్ణయం కాదన్నారు. ప్రస్తుతం ఉన్న బ్యాటర్ల స్థానాలను మార్చకుండా బౌలింగ్ విభాగంలో మార్పులు చేయడానికే తాను ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. **రాణిస్తున్న అభిషేక్, సంజూ** ప్రస్తుత సిరీస్‌లో భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ తమదైన శైలిలో రాణిస్తున్నారు. అభిషేక్ నాలుగు మ్యాచ్‌ల్లో 139 పరుగులు చేయగా, సంజూ 152 పరుగులతో ఆకట్టుకున్నాడు. అయినప్పటికీ కొన్ని మ్యాచ్‌ల్లో తక్కువ స్కోర్లకే పరిమితం కావడంతో వైభవ్‌కు అవకాశం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది. **సిరీస్ విజేతను తేల్చే పోరు** భారత్, వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రస్తుతం 22తో సమంగా ఉంది. శనివారం, అక్టోబర్ 17న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరిగే చివరి మ్యాచ్‌లో గెలిచిన జట్టుకే సిరీస్ దక్కుతుంది. ఈ కీలక పోరులో వైభవ్‌కు తుది జట్టులో చోటు లభిస్తుందా? లేక మరోసారి బెంచ్‌కే పరిమితమవుతాడా? అనేది ఆసక్తికరంగా మారింది

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





# చూపు తిప్పుకోనివ్వని అందంతో సాయి పల్లవి..

## 'రామాయణ' ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణ..



దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'రామాయణ'. ఈ భారీ బడ్జెట్ సినిమా అంతర్జాతీయ ట్రైలర్ విడుదల కార్యక్రమం నిన్న బెంగళూరులో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో సీత పాత్రధారి సాయి పల్లవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన పాత్రకు తగ్గట్టుగా, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూ ఆమె ధరించిన గులాబీ రంగు పట్టుచీర అందరి దృష్టినీ ఆకర్షించింది.
నితీశ్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా తొలి భాగాన్ని దీపావళి కానుకగా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు చిత్రబృందం మొత్తం హాజరైంది. రాముడి పాత్రలో నటిస్తున్న రణ్‌బీర్ కపూర్, రావణుడిగా యశ్, ఇంకా రవి దూబే, రకుల్ ప్రీత్ సింగ్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి పల్లవి ప్రత్యేకంగా డిజైన్ చేయించిన గులాబీ రంగు సిల్క్ శారీలో కనిపించారు. చీరపై వెండి జర్దోసీ వర్క్, వెండి బ్రోకేడ్‌తో వృత్తాకార మోటిఫ్‌లు, బోర్డర్ వెంబడి కట్‌వర్క్ డిజైన్ అద్భుతంగా ఉన్నాయి. దానికి సరిపోయేలా మోచేతుల వరకు చేతులున్న బ్లౌజ్‌ను ధరించారు. నగలు కూడా హుందాగా, తక్కువగా ఎంచుకున్నారు. స్టడెడ్ చెవిపోగులు, ఉంగరాలు, చేతికి కొన్ని గాజులతో చాలా అందంగా కనిపించారు.
సహజంగా కనిపించేలా, తక్కువ మేకప్‌తో ఆమె మరింత అందంగా కనిపించారు. వేదికపై సాయి పల్లవి కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. సీత లాంటి పవిత్రమైన పాత్రను పోషించడం ఒక వరం, గొప్ప బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సినిమాపై అంచనాలను మరింత పెంచింది.

# 'వారణాసి'లో మోస్ట్ కాంప్లెక్స్ మైండ్..

## పృథ్వీరాజ్‌కు మహేశ్, జక్కన్న బర్త్ డే విషెస్.. స్పెషల్ ఫొటో రిలీజ్



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న గ్లోబల్ చిత్రం 'వారణాసి' నుంచి ఓ ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్న మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు (అక్టోబర్ 16) సందర్భంగా చిత్రబృందం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ పోషిస్తున్న 'కుంభ' పాత్రకు సంబంధించిన ఓ కీలక విషయాన్ని వెల్లడించింది.
ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థలు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశాయి. రాజమౌళి, పృథ్వీరాజ్ సెట్స్‌లో ఓ సన్నివేశం గురించి సీరియస్‌గా చర్చించుకుంటున్న వర్కింగ్ స్టిల్‌ను పంచుకున్నాయి. ""వారణాసి' ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైన మేధస్సు కలిగిన వ్యక్తి.. హ్యాపీ బర్త్ డే కుంభ" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నాయి. ఈ ఒక్క వాక్యంతో సినిమాలోని విలన్ పాత్ర ఎంత శక్తిమంతంగా ఉండబోతుందో చెప్పకనే చెప్పాయి.
మరోవైపు హీరో మహేశ్ బాబు, దర్శకుడు రాజమౌళి కూడా పృథ్వీరాజ్‌కు వ్యక్తిగతంగా బర్త్ డే విషెస్ తెలిపారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు కుంభ. ఈ రోజు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను. మీకు ఎల్లప్పుడూ ప్రేమ, సంతోషం లభించాలని ఆశిస్తున్నాను" అంటూ మహేష్ బాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దర్శకధీరుడు రాజమౌళి తనదైన శైలిలో పృథ్వీరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, అతని పాత్ర ప్రాధాన్యతను వివరించారు. "హ్యాపీ బర్త్ డే పృథ్వీ. ఈ రోజు నీలో ఉన్న 'కుంభ'ను నిద్రలేపాలని నేను అనుకోలేదు. ప్రపంచంపై తనదైన ముద్ర వేయాలని విధి నిర్ణయించుకున్న వ్యక్తి కుంభ" అని రాజమౌళి రాసుకొచ్చారు. రాజమౌళి పోస్ట్‌తో కథానాయకుడికి ధీటుగా, ఓ బలమైన లక్ష్యంతో ప్రతినాయకుడి పాత్రను తీర్చిదిద్దినట్లు స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రంలో వరల్డ్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, క్యారెక్టర్ పోస్టర్లు ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తించాయి. ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై కేఎల్ నారాయణ, కార్తికేయ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.

# దేశం విడిచి వెళ్లాలని నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు నోటీసులు..

## స్పందించిన జీవిత భాగస్వామి లేఖా వాషింగ్టన్



బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఊహించని షాక్ ఇచ్చింది. అమెరికా పౌరసత్వం కలిగిన ఇమ్రాన్, అక్టోబర్ 28వ తేదీలోగా భారతదేశం విడిచి వెళ్లాలని నోటీసులు జారీ చేసింది. ఇటీవల ముంబైలో జరిగిన సీజేపీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నందుకుగాను ఆయనపై ఈ చర్యలు తీసుకున్నారు. ఈ నోటీసులను బాంబే హైకోర్టులో సవాల్ చేసేందుకు ఇమ్రాన్ ఖాన్ సిద్ధమవుతున్నారు. వివరాల్లోకి వెళితే, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న ముంబైలోని ఆగస్ట్ క్రాంతి మైదానంలో కాక్‌రోచ్ జనతా పార్టీ (జజీపా) ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్ ఖాన్ తన భాగస్వామి, నటి లేఖా వాషింగ్టన్, కజిన్ జయాన్ మేరీ ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకుని, అదే రోజు రాత్రి విడుదల చేశారు. అయితే, విదేశీ పౌరసత్వం ఉన్న వ్యక్తి రాజకీయ నిరసనలో పాల్గొనడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ నేత కిరీట్ సోమయ్య చేసిన ఫిర్యాదు మేరకు ఖీ==ూ ఈ నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామంపై ఇమ్రాన్ ఖాన్, లేఖా వాషింగ్టన్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అప్పట్లో పోలీసు వ్యాన్‌లో ఇమ్రాన్‌తో కలిసి దిగిన ఫొటోను ఆమె తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'జస్ట్' అనే క్యాప్షన్‌తో పాటు హార్ట్ ఎమోజీలతో పోస్ట్ చేశారు. గతంలోనూ ఆమె ఈ ఘటనపై స్పందిస్తూ... తాము నిరసనలో పాల్గొనడానికి వెళ్లలేదని, అదుపులోకి తీసుకున్న తమ స్నేహితుల గురించి తెలుసుకోవడానికి వెళ్లామని, ఆ సమయంలో పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించి గాయపరిచారని ఆరోపించారు.

# హోటల్ గదికి రమ్మన్నాడు.. ఆ తర్వాత సినిమా నుంచి తీసేశాడు : విద్యా బాలన్

ప్రముఖ బాలీవుడ్ నటి విద్యా బాలన్ తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న ఓ చేదు అనుభవం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ దర్శకుడు తనను హోటల్ గదికి రమ్మని బలవంతం చేశాడని, ఆ తర్వాత తనను సినిమా నుంచి తొలగించాడని ఆమె వెల్లడించారు. చెన్నైలో ఓ యాడ్ ఫిల్మ్ షూటింగ్ కోసం వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగిందని విద్యా బాలన్ గుర్తుచేసుకున్నారు. అప్పటికే ఓ సినిమాకు సంతకం చేసిన తాను, ఆ చిత్ర దర్శకుడిని కలవాల్సి వచ్చిందన్నారు. "కాఫీ షాప్‌లో కలుద్దామని నేను చెప్పినా, అతను మాత్రం హోటల్ గదికి వెళ్లి మాట్లాడుకుందామని పదేపదే పట్టుబట్టాడు. అతని ఉద్దేశంపై అనుమానం రావడంతో, గదిలోకి వెళ్లాక నేను సమయస్ఫూర్తితో తలుపు తెరిచే ఉంచాను. దీంతో ఐదు నిమిషాల్లోనే అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు" అని విద్యా బాలన్ వివరించారు. అయితే, ఈ సంఘటన తర్వాత తనను ఆ ప్రాజెక్ట్ నుంచి తొలగించారని ఆమె పేర్కొన్నారు. ఆ దర్శకుడు ఎలాంటి తప్పుడు ప్రతిపాదన చేయనప్పటికీ, అతని ప్రవర్తనలోని ఉద్దేశాన్ని గ్రహించి అలా ప్రవర్తించానని తెలిపారు. ఇది పూర్తిస్థాయి క్యాస్టింగ్ కౌచ్ అనుభవం కాకపోయినా, స్వీయరక్షణ కోసం అప్రమత్తంగా వ్యవహరించానని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలో తనకు ఇలాంటి సంఘటనలు ఎక్కువగా ఎదురుకాలేదని, ఈ విషయంలో తాను అదృష్టవంతురాలినని విద్యా బాలన్ అన్నారు. ఏ అవకాశం కూడా భద్రతను పణంగా పెట్టేంత పెద్దది కాదని చెప్పారు.



# బాక్సాఫీస్ వద్ద 'జైలర్ 2' గర్జన.. తొలిరోజే రికార్డు కలెక్షన్లు!



సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో నిరూపించారు. ఆయన కథానాయకుడిగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్ 2' చిత్రం నిన్న థియేటర్లలోకి విడుదలైంది. విడుదలై తొలిరోజే వసూళ్ల సునామీ సృష్టించింది. ప్రముఖ ట్రేడ్ వర్గాల ప్రాథమిక అంచనాల ప్రకారం.. ఈ సినిమా మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 125.25 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది. ఇది తమిళ చిత్ర పరిశ్రమలో భారీ ఓపెనింగ్‌గా నిలిచింది. ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'శాక్‌నిల్క్' వెల్లడించిన వివరాల ప్రకారం.. 'జైలర్ 2' భారత్‌లో తొలిరోజు రూ. 59.70 కోట్ల నెట్, రూ. 70.25 కోట్ల వసూళ్లను సాధించింది. దేశవ్యాప్తంగా దాదాపు 16,599 షోల ద్వారా ఈ వసూళ్లు రాగా, సగటున 55.4% ఆక్యుపెన్సీ నమోదైంది. మరోవైపు ఓవర్సీస్ మార్కెట్లలోనూ రజినీ మేనియా స్పష్టంగా కనిపించింది. విదేశాల్లో ఈ చిత్రం మొదటి రోజే రూ. 55 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. మొత్తం మీద 37 లక్షలకు పైగా ప్రేక్షకులు తొలిరోజే ఈ సినిమాను థియేటర్లలో వీక్షించారు. భాషల వారీగా చూస్తే, తమిళ వెర్షన్ వసూళ్లలో అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క తమిళనాడులోనే 9,326 షోల ద్వారా రూ. 43.35 కోట్ల నెట్ వసూలు చేసి, 70.8% భారీ ఆక్యుపెన్సీని నమోదు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ 'జైలర్ 2'కు ఘన స్వాగతం లభించింది. ఇక్కడ ఈ చిత్రం తొలిరోజు రూ. 12.50 కోట్లు కలెక్ట్ చేసింది. ఇక హిందీలో రూ. 3.50 కోట్లు, కన్నడలో రూ. 0.35 కోట్లు వసూలు చేసింది. అత్యధిక వసూళ్లు సాధించిన రాష్ట్రాల్లో తమిళనాడు తర్వాత కర్ణాటక, ఆంధ్రప్రదేశ్–తెలంగాణ, కేరళ నిలిచాయి. అయితే, ఇటీవల విడుదలైన 'కూలీ', 'లియో' చిత్రాల తొలిరోజు ప్రపంచవ్యాప్త వసూళ్లతో పోలిస్తే 'జైలర్ 2' కాస్త వెనుకబడినప్పటికీ, తమిళ సినీ చరిత్రలో ఇది మూడవ అతిపెద్ద ఓపెనింగ్‌గా నిలిచింది. ప్రస్తుతం వెలువడినవి ప్రాథమిక అంచనాలు మాత్రమేనని, తుది లెక్కల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

# రణబాలి : చరిత్రకు యాక్షన్ తోడు..

విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటించిన చారిత్రక చిత్రం 'రణబాలి'. దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ 1870ల నాటి బ్రిటిష్ పాలన నేపథ్యంలో రాయలసీమ వీరుడి పోరాటాన్ని తెరపై ఆవిష్కరించారు. కరవు వెనుక బ్రిటిష్ అధికారుల దోపిడీని గుర్తించిన రణబాలి, ప్రజల ఆకలి తీర్చేందుకు సాగించే పోరాటమే చిత్ర కథాంశం. విజయ్ దేవరకొండ కొత్త లుక్, నటన ఆకట్టుకుంటాయి. రష్మికతో ఆయన కెమిస్ట్రీ బాగున్నప్పటికీ, రొమాన్స్, భావోద్వేగ సన్నివేశాలు ఆశించిన స్థాయిలో పండలేదు. 1870ల నాటి వాతావరణాన్ని ప్రతిబింబించడంలో దర్శకుడు సఫలమయ్యారు. సినిమాటోగ్రఫీ, యాక్షన్ సన్నివేశాలు మెప్పిస్తాయి. అజయ్‌అతుల్ నేపథ్య సంగీతం ఓ మోస్తరుగా ఉంది. అయితే నెమ్మదైన కథనం, వినోదం లోపించడం, కొన్ని సాగదీసిన సన్నివేశాలు ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. చారిత్రక నేపథ్యం, విజయ్ నటన కోసం చూడదగిన చిత్రమే అయినా, ఆసక్తికరమైన కథనంలో వేగం లోపించడం ప్రతికూలత.





Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613